# అంతఃకరణ విజ్ఞానము

# THE SCIENCE OF ANTAHKARANA



డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ M.Sc., Phd

యతీనాం బ్రహ్మ భవతి సారథి

విజ్ఞాన్ వేదిక్ ట్రస్ట్ ఇంటర్‌నేషనల్

50, సుకృతివిల్లా, వేణుగోపాలనగర్,

గుంటూరు.

# అంతఃకరణ విజ్ఞానము

## THE SCIENCE OF ANTAHKARANA

అంతఃకరణలో నాలుగు భాగాలున్నాయి. దాంట్లో మొదటిది మనస్సు. రెండవది బుద్ధి. మూడవది చిత్తం. నాల్గవది అహంకారం.

**మనస్సు :**

ఆలోచనల సమూహామే మనస్సు. అవి ఆగిపోతే మనస్సు లేనట్లే. ఈ మనస్సు నుపయోగించుకుని వ్యక్తి తన జీవితాన్ని మాత్రమే ఆలోచించు కుంటూ కూడు, గుడ్డ, గూడుల కోసం తపిస్తుంటాడు. ఈ స్థితిలో వ్యక్తిత్వము (Individuality) గల మనిషి వుంటాడు.

ఈ మనస్సు ఆలోచించడము మాత్రమే చేస్తుంది. అయినా దీనిలో రెండు భాగాలున్నాయి. 1) నిమ్న మనస్సు లేక సగుణ మనస్సు (Lower Mind), 2) ఊర్ధ్వ మనస్సు లేక నిర్గుణ మనస్సు (ఉన్నత మనస్సు Higher Mind).

కోరికల శరీరం నుండి వచ్చే స్పందన కనుగుణంగా స్పందిస్తూ ఆలోచన చేసేది నిమ్న మనస్సు. సర్వ సాధారణంగా మానవులంతా దీంట్లోనే జీవిస్తారు. రెండవది అయిన ఉన్నత మనస్సులో దివ్యమైన దైవీ లక్షణా లుంటాయి. అవి భావాల రూపంలో వుంటాయి. వీనినే ప్రేమ, దయ, కరుణ, త్యాగము, సేవ వంటి వానిగా చెబుతారు.

**"జంతూనాం నరజన్మ దుర్లభం"** అన్న సూక్తిలో నరజన్మ జంతువు లలో దుర్లభమని చెప్పినప్పటికీ- నిమ్న మనస్సుకు లోబడి జీవించడం అంటే వ్యక్తి చైతన్యం జంతుస్థితిలో, నీచస్థితిలోనే వున్నట్లే.

**బుద్ధి :**

అంతఃకరణ చతుష్టయంలో రెండవది అయిన బుద్ధి యొక్క పని నిర్ణయాలు తీసుకోవడం. నిర్ణయాలు తీసుకోవడంలో వివేకం పని చేస్తుంది. ***ఈ వివేక రూపమైన సద్బుద్ధినే గాయత్రి అంటారు.***

శాశ్వతము - అశాశ్వతము, నిత్యము అనిత్యము, ధర్మము -

అధర్మము, మంచి - చెడు, ఆత్మ - అనాత్మలవంటి వాటికి గల ధర్మాలను తెలుసుకుని వివేకంతో సరియైన నిర్ణయాలు తీసుకోగలందులకే - మానవాళిపై ప్రేమతో పరమ గురువుల మండలి 1875 నుండి గాయత్రీ మంత్రాన్ని - ఏ నియమ నిబంధనలు లేకుండా, ఓ వరంగా ప్రసాదించింది. ఈ వరము స్వామి దయానంద సరస్వతి ద్వారా భారత దేశంలో అందచేయబడితే - విదేశాలలో దివ్యజ్ఞాన సమాజం (Theosophical Society) పేరుతో మేడమ్ బ్లావెట్స్కీ ద్వారా అందించబడింది. ***థియొసాఫికల్ సొసైటీ గ్రంథాలన్నిటా చెప్పబడినది బ్రహ్మజ్ఞానమే.*** ఈ మొత్తం గాయత్రీ మంత్రానికి - విస్తృతమైన, విశేషమైన వ్యాఖ్యానముగా గుర్తించాలి.

బుద్ధితలంలో సాధకుడు ప్రవేశిస్తే అన్నిరకాల భేదాలు సమసిపోతాయి. అనేకత్వంలో ఏకత్వం చూడటం ఇక్కడ స్పష్టంగా తెలుస్తుంది. "ఏకం సత్". ఉన్నదంతా ఒక్కటే. అదే "సత్" అన్న దర్శనం కలుగుతుంది. ***ఆ ఏకైక సత్యమే విభిన్న రూపాలు ధరించినదని తెలుస్తుంది.***

## చిత్తము :

ఈ బుద్ధి తర్వాతది చిత్తము. ***చిత్తము అంటే*** ఆలోచించే మనసు నుండి ఓ నిర్ణయాన్ని "బుద్ధి" తీసుకుంటే - ఆ నిర్ణయం అమలుకావటానికి ఇంద్రియాలను ( 5 కర్మేంద్రియాలను, 5 జ్ఞానేంద్రియాలను) ఉపయోగించుకొనుటకై ***చైతన్యం ఇంద్రియాలతో కలిసి పని చేసే స్థితి*** (సంస్కార నిలయం). దీనివల్ల మంచి పనులు అయినప్పటికీ, చెడుపనులైనప్పటికీ చైతన్యంలో ఓ విధమైన గాడి (Groove ) ఏర్పడుతుంది. ఇది అలవాటుగా మారిపోయి - గానుగఎద్దు గుండ్రంగా తిరిగినట్లు - చిత్తం కూడా ఆయా ఇంద్రియాలలోనే తిరుగుతుంటుంది.. ఈ విధంగా ఏర్పడ్డ 'గాడి'నే వృత్తి అంటారు. చిత్తానికి యీ విధంగా వృత్తులు ఏర్పడతాయి. ఆ వృత్తులు వ్యక్తిని బహిర్ముఖుణ్ణి చేస్తాయి.

సాధనలో లోతులకు వెళ్ళాలంటే అంతర్ముఖులం కావాలి. అంతర్ముఖులం కావాలంటే - చిత్తవృత్తులను నిరోధించాలి, అరికట్టాలి. ఈ చిత్తవృత్తుల నిరోధం కోసమే పతంజలి మహర్షి ***"యోగ సూత్రాలు"*** అందించారు. పతంజలి మహర్షి ఆదిశేషుని అవతారము. వారు ఘనీభవిం

చిన సూర్యకిరణ స్వరూపులని జీవితచరిత్ర చెబుతోంది. చిత్త వృత్తుల నిరోధమే యోగమని వీరి నిర్వచనం.

## సూర్యకిరణ విజ్ఞాన ఆవశ్యకత :

"యోగః చిత్తవృత్తి నిరోధః" యోగము అనగా కలయిక. చిత్త వృత్తుల నిరోధం జరిగాక యోగం సిద్ధిస్తుందని మహర్షి వాక్కు. **యోగము అంటే** మనస్సును ఆత్మకు సమర్పణ చేసుకుని **ఆత్మలో మనస్సు సంపూర్ణంగా లీనమవ్వడం.** ఈ కార్యక్రమానికి అడ్డుపడేవే చిత్తవృత్తులు. ఈ చిత్తం గురించి సమగ్ర అవగాహన కలగాలంటే సూర్యకిరణ విజ్ఞానం తెలియాలి. **ఈ సృష్టి మొత్తం ఘనీభవించిన *సూర్యకిరణములే*** అన్న భావన సుస్పష్టంగా దర్శనమవ్వాలి.

సూర్యకిరణముల ద్వారా ప్రజ్ఞ - పంచభూతములైన భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశములతో కలిసి - పదార్థాలుగా ఏర్పడు తుంది. కిరణాలలోని ప్రజ్ఞ ఈ అయిదు భూతాలను ప్రకృతి నుండి ఆకర్షించు కోగల శక్తి సామర్థ్యాలను కలిగి వుంటుంది. తాను ఆకర్షించుకున్న ఐదు భూతాలు; వాటి గుణాలైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలను - విశ్వకల్యాణానికై వినియోగించడం అనేదే సూర్యకిరణ విజ్ఞానం.

సూర్యునికి గల ఏడు కిరణాలు సమస్తాన్నీ సృష్టిస్తున్నాయి. ఈ 7 కిరణాలు 1. సంకల్పము, 2. ప్రజ ప్రేమ, 3. సక్రియత, 4. సంతులనం, 5. విజ్ఞానం, 6. భక్తి, 7. వ్యవస్థ. ఈ ఏడు రకాల శక్తుల్ని వుపయోగించు కోవడం ఎలాగో తెలుసుకుంటేనే "చిత్తం" తెలుస్తుంది. దీనికి జ్యోతిర్విద్య బాగా తోడ్పడుతుంది.

## అహంకారము :

అంతఃకరణ చతుష్టయంలో చివరిది "అహంకారము" (Ego). ఈ అహంకారం వల్లనే జన్మల పరంపర ఏర్పడుతుంది.

గీతాచార్యుడు దీనినే "**మమైవాంశో జీవలోకే**" అన్నారు.

ఏదో ఒక కోరిక - మానవ జన్మకు కారణం. **ఆ కోరిక** నెరవేర్చు కునేందుకు జన్మలు ఎత్త వలసిందె - ఆ కోరిక స్వార్థపరమైనదైనా, విశ్వ

కల్యాణ కారణమైనదైనా సాధారణ వ్యక్తులకు ఈ అహంకారం - 'నేను సేవకుణ్ణి, నేను ఉద్యోగిని, కలెక్టర్‌ని, నేను ప్రెసిడెంట్‌ని;' ఇలా వుంటుంది.

కానీ ***అసలైన అహంకారం "నేను పరమాత్మ అంశను. అవినాశిని. నిత్యుడను. శాశ్వతుడను" అన్న దృఢమైన భావన.***

## జన్మ పరంపరయొక్క అవగాహన - కర్తవ్య బోధ :

ఈ విధంగా చిత్త వృత్తుల నిరోధం చేసుకుని మనస్సును ఆత్మకు సమర్పణ చేసుకున్న సాధకుడు - తర్వాత సాధనలో, తన ఆత్మను విశ్వాత్మకు సమర్పణ చేస్తాడు. విశ్వాత్మలో ఏకమౌతాడు. వానికి జన్మజన్మ పరంపర మొత్తం అవగాహన అవుతుంది.. భూతకాలంలోకీ, భవిష్యత్‌లోకీ వెళ్ళి జన్మలన్నీ చూడగలడు.

ఈ విధమైన స్థితిని సాధించితే ఆ సాధకుడు ఏ విధంగా మాట్లాడతాడు ?

దీన్నే గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పాడు.

"బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।
తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరన్తప ॥"

(గీత 4 అ. 5 శ్లో.)

నాకు నీకు అనేక జన్మలు గడిచాయి. నాకు అవన్నీ తెల్సు, నీకు తెలీవు అని శ్రీకృష్ణుడు అర్జునుడితో అంటాడు. ఈ విధంగా పునర్జన్మ సిద్ధాంతం అవగతమౌతుంది.

ఈ స్థాయిని చేరుకున్న సాధకునికి అనంతమైన ఈ సౌరవ్యవస్థల్లో బ్రహ్మాండంలో తన కర్తవ్యం ఏమిటో బోధపడ్తుంది. తదనుగుణంగా జీవిస్తాడు.

## మంత్రశాస్త్ర ప్రాముఖ్యము :

మనస్సు నుండి బుద్ధిలోనికి చిత్తవృత్తులు నిరోధించి చిత్తంలో నిలబడి - అహంకారంలో మార్పు తెచ్చుకునేటందుకు - భారతీయ ఋషులిచ్చిన అద్భుతమైన విద్య "మంత్ర శాస్త్రం". మంత్రములకు అంత రిక్షంలో గల దైవశక్తులను ఆకర్షించే గుణం వుంది. మననము చేయబడేదే మంత్రం.

దైవీ లక్షణాలను పదేపదే గుర్తు తెచ్చుకుంటూ దానికి తగినటు వంటి క్రియాకలాపాలు చేపట్టడం అనేది సాధకుడు చేయవలసిన పని.

***ప్రకృతిలో గల దైవీ శక్తుల్ని ఆకర్షించుకుని, దివ్యత్వం పొంది, దాన్ని లోక కల్యాణానికి వెచ్చించడానికి భగవంతుడు వ్యక్తికి ఇచ్చిన అమూల్య కానుక - మానవ అంతఃకరణము.***

భగవదేచ్ఛ ప్రకారం మానవ జాతి అంతఃకరణను ఆ విధంగా ఉపయోగించుకుని దివ్య మానవులుగా పరిణతి చెందెదరు గాక!

– స్వస్తి –

